
వనపర్తి పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో హారతి తీసుకుంటున్న భక్తులు


ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి

వ్యవసాయానికే.. ప్రాధాన్యం

- వనపర్తి నియోజకవర్గంలో ప్రతీ ఎకరాకు నీరందించడమే లక్ష్యం
- 1.2 టీఎంసీల సామర్థ్యంలో రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు
- వనపర్తిలో 500 పడకలు, పెబ్బేరులో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి కృషి
- స్కిల్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ స్కూల్, అన్ని గురుకులాలకు శాశ్వత భవనాలు
- 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూలో వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'గతంలో పనిచేసిన పాలకులు వనపర్తిని రాసిచ్చినట్లుగా తమ ఏలుబడిని కొనసాగించారు.. ప్రజల ఆత్మగౌరవం మీద దెబ్బకొట్టి ఏకపక్ష పాలన చేశారు.. ఎదుగుతున్నారనే అక్కసుతో ఆర్థికంగా, మానసికంగా దెబ్బకొట్టాలని ప్రయత్నించారు. ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని.. వారి అండతో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నాను. సేవ్ వనపర్తి-చేంజ్ వనపర్తి పేరుతో ఉద్యమం ప్రారంభిస్తే.. అతి తక్కువ కాలంలోనే ప్రజలు అత్యధిక మెజారిటీతో ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించారు. ప్రత్యక్ష రాజకీయాల కంటే ముందే ప్రజా జీవితంలో ఉన్నాను. ఆత్మగౌరవమనే అంశమే నన్ను ముందుకు నడిపిస్తోంది. భవిష్యత్‌లోనూ వనపర్తి ప్రజలకు స్వేచ్ఛాయుత పాలన అందించడానికి కట్టుబడి ఉంటాను. నియంత్రణ, నిర్బంధం జోలికి పోకుండా ప్రజలు అందరూ హాయిగా జీవించేలా నా పనితీరు ఉంటుంది.' అంటున్న వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డితో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ముందుగా మీ కుటుంబ నేపథ్యం.. రాజకీయాల్లోకి వచ్చిన తీరును చెప్పండి?

మాది రైతు కుటుంబం. నాన్న సాయిరెడ్డి, అమ్మ వెంకటమ్మ. ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపూర్‌లో పుట్టి పెరిగాం. అక్కడే మూడో తరగతి వరకు చదువుకుని, ఆ తర్వాత మామిడిమాడలో చదువుకున్నాం. తర్వాత ఖిల్లాఘణపురానికి సైకిల్‌పై వెళ్లి చదువుకున్నాం. 2000 సంవత్సరంలో చిన్న కన్‌స్ట్రక్షన్ కంపెనీ స్టార్ట్ చేశా. 2007 వరకు ఇతర రాష్ట్రాల్లో కాంట్రాక్టులు చేసే స్థాయికి ఎదిగాం. పెద్దమందడి మండలంలోని అల్వాలకు సర్పంచుగా, ఎంపీటీసీ సభ్యుడిగా పని చేశాను. తర్వాత పెద్దమందడి ఎంపీపీగా చేశాను. ఇప్పుడు ఎమ్మెల్యేగా సేవలందిస్తున్నాను. భార్య శారద. కుమారులు నవనీత్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి ఇద్దరూ విదేశాల్లో ఉన్నారు. వారు సెటిల్ అయినట్లే. ఇప్పుడు నేను కేవలం వనపర్తి అభివృద్ధి, ఆత్మగౌరవం నినాదంతో పాలన అందిస్తున్నాను.

రాజకీయాల్లోకి ఎలా వచ్చారు?

నేను ప్రత్యక్ష రాజకీయాల్లో రాక ముందే.. మా ఊర్లో వివిధ సందర్భాల్లో సహాయ కార్యక్రమాలు చేపట్టా. కల్యాణలక్ష్మి కంటే ముందే ప్రతీ ఆడపిల్లకు రూ.21 వేలు సాయం చేశాను. ఎవరైనా ఇంట్లో చనిపోతే దహనసంస్కారాలకు సాయంగా రూ.ఐదు వేల చొప్పున ఇచ్చాను. సర్పంచు, ఎంపీటీసీగా ఉన్నప్పుడే కాదు, ఎంపీపీ అయిన తర్వాత మండలానికి, ఇప్పుడు ఎమ్మెల్యే అయ్యాక నియోజకవర్గానికి ఈ సేవలను విస్తరించా. మేఘన్న అభయహస్తం పేరుతో ఇస్తున్నాం. ఈ సేవా కార్యక్రమాల్లో భాగంగానే రాజకీయాల ద్వారా మెరుగ్గా సేవ చేయొచ్చని అనుకున్నాం.

ఎంపీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఎందుకు భావించారు?

నేను స్వతహాగా ఒక కాంట్రాక్టర్‌ను. వివిధ రాష్ట్రాల్లో నా కంపెనీ

(మిగతా 6లో..)

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు


అలంపూరులో జోగుళాంబ అమ్మవారి దర్శనానికి క్యూలైన్లో భక్తులు


నాగర్‌కర్నూల్ జిల్లా : జనసంద్రంగా మారిన వట్టెం వెంకన్న ఆలయ ప్రాంగణం

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో నూతన సంవత్సర వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా చేసుకున్నారు. అర్ధరాత్రి కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నా రు. బుధవారం తెల్లవారుజామునే మహిళలు ఇంటిముందు కల్లాపి చల్లి న్యూ ఇయర్ ముగ్గులు వేశారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రముఖ దేవాలయాలు, పర్యాటక ప్రాంతాల వద్ద సందర్శకుల సందడి కనిపించింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సీతారామస్వామి, వేంకటేశ్వరస్వామి, అయ్యప్పస్వామి ఆలయంతో వట్టెం, పాలెం వేంకటేశ్వరస్వామి, అచ్చంపేట ఉమామహేశ్వరం ఆలయం, సోమశిల లలితా సోమేశ్వర ఆలయం, జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూరు బాల బ్రహ్మేశ్వరస్వామి ఆల యం, వనపర్తిలోని వేంకటేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలతో పాటు వివిధ ఆల యా ల్లో భక్తుల రద్దీ కనిపించింది.


అచ్చంపేట : ఉమమహేశ్వర ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ


వనపర్తి పట్టణంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


నాగర్‌కర్నూల్ : ఊర్కొండపేట అభయాంజనేయస్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కేసరిసముద్రం మినీ ట్యాంక్‌బండ్ చెరువులో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

ఒక్క రోజే రూ. 3.30 కోట్ల విలువైన మద్యం తాగేశారు

- వనపర్తి జిల్లాలో ఏరులై పారిన మద్యం

- రెండు రోజుల్లో రూ.7.79 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు
- డిసెంబరు 31న కిటకిటలాడిన వైన్స్, బార్లు

6


డిసెంబరు 31వ రోజు రాత్రి మందుబాబులతో కిక్కిరిసిన వనపర్తి పట్టణంలో పెబ్బేరు రోడ్డులోని మద్యం దుకాణం

సంప్రదాయ సౌందర్యం

- లంబాడీ మహిళల వస్త్రాలంకరణ ప్రత్యేకం
- దుస్తులపై పూసలు, అద్దాలతో డిజైన్లు
- జడకు చుంచులు, చెవులకు లోలాకులు

హోరాహోరీగా నెట్‌బాల్ టోర్నీ

7

మందుబాబుల దూకుడుకు కళ్లెం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 139 కేసులు నమోదు
- మహబూబ్‌నగర్ జిల్లాలో అధికంగా 93..
- ప్రశాంతంగా న్యూ ఇయర్ వేడుకలు

జిల్లాల వారీగా నమోదైన డ్రంకెన్ డ్రైవ్ కేసుల వివరాలు

జిల్లా	కేసులు
మహబూబ్‌నగర్	31
నారాయణపేట	22
నాగర్‌కర్నూల్	6
జోగుళాంబ గద్వాల	25
వనపర్తి	55
మొత్తం	139


నాగర్‌కర్నూల్ పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం వేడుకల నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులు 139 కేసులు నమోదు చేశారు. తమ టాస్కను విజయవంతంగా పూర్తి చేశారు. ఎక్కడా ఎలాంటి గొడవలు, ప్రమాదాలు లేకుండా వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. డిసెంబరు 31న విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తామని మూడ్రోజుల ముందు నుంచే పోలీస్‌శాఖ చెప్పినట్లుగానే పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టింది. డిసెంబరు 31 అంటేనే మందేసి, చిందేస్తారు. గల్లీగల్లీలో డీజేలు పెట్టి డ్యాన్స్‌లతో హోరెత్తించేవారు. అర్ధరాత్రి 12 గంటలు

(మిగతా 6లో..)

దిష్టిబొమ్మల్లా క్రీడా ప్రాంగణాలు

- బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న గత ప్రభుత్వం
- గద్వాల జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల్లో ఇదే పరిస్థితి
- ఒక్కో ప్రాంగణం ఏర్పాటుకు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చు
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ సాఫ్ట్‌వేర్ మార్పుతో నిలిచిన రూ. 2 కోట్ల బిల్లులు

6



మల్దకల్ మండలం బూడిదపాడు గ్రామంలో కంపచెట్లతో దర్శనమిస్తున్న గ్రామీణక్రీడా ప్రాంగణం


'బీసీబంధు' పై ప్రభుత్వం ఆరా !

- జిల్లాకు మంజూరైన రూ.6 కోట్ల నిధులపై విచారణకు ఆదేశం
- యూనిట్లు స్వీకరించకుండానే 2023లో రుణాలు మంజూరు!
- షరతులు లేకుండానే లక్ష అందజేసిన ప్రభుత్వం
- అర్హులకు కాకుండా, అనర్హులకే అందజేశారనే విమర్శలు



6

లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు


అప్పాజిపల్లిలో లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు గంగాధరశర్మ

తిమ్మాజిపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని అప్పాజిపల్లి శివారులో నరసన్నగుట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తులు బుధవారం పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి వాహనాలపై కాలినడకన భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడం విశేషం. ఆలయకొండ ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. గోవింద నామస్మరణతో మార్మోగింది. లక్ష్మీనరసింహస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు చేశారు. అదేవిధంగా లక్ష్మీనరసింహస్వామివార్లకు అర్చకుడు గంగాధరశర్మ ప్రత్యేక పూజలు చేశారు.





మందుబాబుల దూకుడుకు కళ్లెం


నాగర్‌కర్నూల్‌లో తనిఖీల్లో పాల్గొన్న పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

కాగానే యువత పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చి వేడుకలు జరుపుకునేవాళ్ళు ద్విచక్రవాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేస్తూ కేరింతలు కొడుతూ, హ్యాపీ న్యూఇయర్ చెప్పుకునేవాళ్ళు. కానీ పోలీస్ శాఖ మంగళవారం సాయంత్రం నుంచి తనిఖీలు చేపట్టడంతో డీజేల మోత వినిపించలేదు. రోడ్లపై రాష్ డ్రైవింగ్ చేసే వాళ్ల సంఖ్య చాలావరకు తగ్గింది. ఎక్కడా రోడ్డు ప్రమాదాలు లేకుండా కట్టడి చేయగలిగారు. జిల్లా ఎస్పీ జానకి కూడా అర్ధరాత్రి రోడ్లపైకి వచ్చి బందోబస్తును పర్యవేక్షించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్క రాత్రి 93 డ్రంకెన్ కేసులు నమోదు చేశారు.


జోగులాంబ గద్వాలలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఆయా మండలాల్లో అధిక కేసులు

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతోపాటు హైవే మండలాలైన బాలానగర్, రాజాపూర్, అడ్డాకుల, జడ్చర్ల పరిధిలో అధికంగా కేసులు నమోదు చేశారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోడ్రైవర్లకు కూడా బ్రీత్ అనలైజర్‌తో తనిఖీలు చేశారు. జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీసులు 27 కేసులు నమోదు చేయగా.. జడ్చర్లలో 10, బాలానగర్‌లో 12, రాజాపూర్‌లో 8 , అడ్డాకులలో 6, మహబూబ్‌నగర్ టూటౌన్ పరిధిలో 8, భూత్పూర్‌లో 4, కోయిలకొండ, హన్వాడ, మిడ్జిల్, దేవరకద్ర పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో మూడేసి చొప్పున కేసులు నమోదు చేశారు. ఎక్కడికక్కడ డ్రంకెన్ తనిఖీలు చేపట్టడంతో జనం రోడ్లపైకి రావడానికి జంకారు. పాలమూరులో డ్రంకెన్ తనిఖీల భయానికి మందుబాబులు అర్ధరాత్రి వేళ కొన్ని బార్ల వద్ద వాహనాలను అక్కడే వదిలి ఇళ్లకు నడుచుకుంటూ వెళ్లారు. ప్రజాప్రతినిధులకు అర్ధరాత్రి వేళ తమ అనుచరులు డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుపడ్డారని అదే పనిగా ఫోన్‌లు వస్తుండటంతో కొందరు ఫోన్‌లను స్విచాఫ్ చేసుకోవాల్సి వచ్చింది. మొత్తంగా గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున తనిఖీలు చేసి, మందుబాబులకు కళ్లెం వేయడంలో పోలీసులు సఫలీకృతులయ్యారు.

పోలీసుల తనిఖీలతో తగ్గిన మద్యం విక్రయాలపై దెబ్బ

ఇదిలా ఉండగా న్యూఇయర్ వేడుకలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మద్యం దుకాణాలకు అర్ధరాత్రి 12 గంటల వరకు, బార్‌లకు ఒంటిగంట వరకు నడుపుకునేందుకు అనుమతిచ్చింది. అయితే పోలీస్ తనిఖీలతో మద్యం విక్రయాలపై దెబ్బపడినట్లు వ్యాపారులు వాపోతున్నారు. పర్మిట్ గదులు, బార్‌లలో కూర్చోవడానికి జనాలు భయపడటం వల్ల అనుకున్న స్థాయిలో విక్రయాలు జరగలేదని అంటున్నారు. అదే సమయంలో చికెన్ వ్యాపారులు, రోడ్లపై చికెన్ వంటకాలు వండివార్చే నిర్వాహకులు కూడా పోలీస్ తనిఖీలతో తమ గిరాకీ దెబ్బతిన్నదని విచారం వ్యక్తం చేస్తున్నారు.


నారాయణపేట జిల్లా కేంద్రంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రభుత్వం మనసు మారాలి

● సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల లక్ష్మిగణపతి యాగం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మనసు మారాలని కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు నిరసన కార్యక్రమంలో భాగంగా లక్ష్మీగణపతి యాగం చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరసన సమ్మె బుధవారంతో 23వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు యాగం చేపట్టగా, ఉద్యోగులంతా పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మనస్సు మార్చుకొని సమస్యలు పరిష్కరించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 19,500 మంది ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. జిల్లా కార్యదర్శి యాదగిరి, చంద్రశేఖర్‌గౌడ్, ఇక్రం, ఇంతియాజ్, సుజాత, జ్యోతి, వేణుగోపాల్, హర్షకుమార్, మన్యం, సత్యం పాల్గొన్నారు.


యాగం చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

వ్యవసాయమే ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

పనులు నిర్వహించేది. వనపర్తిలో సాగునీరు అందించడంలో నాది కీలక భూమిక. ఎలాంటి ప్రొసిడింగ్స్, టెండర్లు లేకపోయినా.. నియోజకవర్గానికి నీళ్లు వస్తే చాలని చాలా పనులు పూర్తి చేశాను. పెద్దమందడి బ్రాంచ్ కెనాల్‌ను రికార్డు సమయంలో తవ్వించాను. కానీ నా ఆత్మగౌరవంపై దెబ్బకొట్టారు. అదే సమయంలో ప్రజలు కూడా నిర్బంధంలో ఉన్నట్లు భావించారు. అందుకే వారి మద్దతుతో పోటీ చేయాలని నిర్ణయించుకున్నా. కేవలం నేను బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన ఎనిమిది నుంచి తొమ్మిది నెలల కాలంలోనే ప్రజల ఆశీర్వాదంతో గెలిచాను.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మీ ముందున్న ప్రాధాన్యం ఏంటి?

వనపర్తి పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్న నియోజకవర్గం. ఎక్కువ ఆదాయం వ్యవసాయం, దాని ఆధారిత రంగాల నుంచే వస్తుంది. కాబట్టి నా మొదటి ప్రాధాన్యం వ్యవసాయమే. ప్రస్తుతం ఉన్న సప్త సముద్రాలన్నీ డౌన్‌స్ట్రీమ్‌లో ఉన్నాయి. వాటివల్ల వనపర్తి కంటే వేరే నియోజకవర్గాలకు ఎక్కువ లబ్ధి ఉంటుంది. అందుకే బుద్ధారం రైట్/లెఫ్ట్ కెనాల్ ద్వారా 45 వేల ఎకరాల ఆయకట్టును సాగులోకి తేనున్నాం. కల్వకుర్తి కింద నీటినిల్వ సామర్థ్యం లేకపోవడం వల్ల గతంలో ఆన్‌లైన్ రిజర్వాయర్ల ప్రతిపాదనలు చేశారు. కానీ నెరవేరలేదు. బుద్ధారం స్టేజ్-2 కింద 0.2 టీఎంసీ, గొల్లపల్లి రిజర్వాయర్‌ను 1 టీఎంసీ సామర్థ్యంతో నిర్మించాలని ప్రతిపాదనలు పెట్టాం. అలాగే వనపర్తి మండలంలో కాశీంనగర్ లిఫ్టును ప్రతిపాదించాం. అప్‌స్ట్రీమ్‌లో రిజర్వాయర్లు ఉండటం వల్ల రెండో పంటకు కూడా ఇబ్బంది ఉండదు. ప్రతీ ఎకరాకు నీరందించడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నాను.

వైద్యానికి ఎలాంటి ప్రతిపాదనలున్నాయి?

వనపర్తిలో ప్రస్తుతం మెడికల్ కాలేజీ మూడో సంవత్సరం నడుస్తోంది. ఇంకో మూడేళ్లలో పీజీకి అర్హత వస్తుంది. ఆలోపు 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే దానికి శంకుస్థాపన జరగాల్సి ఉంది. నిధుల విడుదల అయిన వెంటనే వేగంగా పనులు పూర్తి చేస్తాం. అలాగే డాక్టర్ల కొరత ఉంది. ఇతర జిల్లాలకు రెఫరల్స్ తగ్గడం లేదని సమాచారం ఉంది. ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం. సీఎస్ఆర్ కింద ఇప్పటికే ఆక్సీజన్ ప్లాంటును జీజీహెచ్‌లో ప్రారంభించాం. పెబ్బేరులో 30 పడకల ఆస్పత్రిని ప్రారంభిస్తాం. గతంలో పనులు చేసిన కాంట్రాక్టర్లంతా పారిపోతుంటే రూ.280 కోట్ల బిల్లులు మంజూరు చేయించాం.

విద్యారంగ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రస్తుతం గురుకులాలతోపాటు పలు విద్యాసంస్థలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటికి శాశ్వత భవనాలు కట్టించాలి. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరైంది. వనపర్తిలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కూడా వచ్చింది. దాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం. గ్రంథాలయాన్ని అప్‌గ్రేడ్ చేసి, డిజిటల్ లైబ్రరీగా మారుస్తాం. మహిళలకు ప్రత్యేకంగా వృత్తి శిక్షణ కేంద్రాలను నెలకొల్పుతాం. ఇప్పటికే చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న వారి కోసం నైపుణ్య శిక్షణతో పాటు మైహోమ్, ఎంఎస్ఎన్, జీఎంఆర్, స్నేహ తదితర కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పించేందుకు జాబ్ మేళాలను ఏర్పాటు చేస్తున్నాం. దరఖాస్తులు కూడా స్వీకరిస్తున్నాం. జేఎన్‌టీయూకి కూడా శాశ్వత భవనం నిర్మిస్తాం. దీనికి రూ.100 కోట్లతో ప్రతిపాదనలు ఉన్నాయి.

పుర అభివృద్ధికి ప్రణాళికలు ఏంటి?

వనపర్తి జిల్లా కేంద్రం చాలా అభివృద్ధి చెందాల్సి ఉంది. కొల్లాపూర్‌కు చెందిన శ్రీశైలం ప్రాజెక్టు ముంపు బాధితులు వచ్చి, ఇక్కడ సెటిల్ కావడంతో జనాభా ఇప్పుడు లక్ష దాటిపోయింది. దానికి అనుగుణంగా ప్రణాళికలు చేయాల్సి ఉంది. ప్రధానంగా మురికివాడలు లేని పట్టణంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో డిస్ట్రిక్ట్ మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్ అంతా సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌కు పోయాయి. టీయూఎఫ్ఐడీసీ రూ.50 కోట్లు, మినరల్ ఫండ్ నుంచి నిధులు వాడుకుంటున్నాం. రూ.35 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించబోతున్నాం. అప్పుడు చెరువుల పేరుతో రూ.రెండు కోట్లు వృథా చేశారు. ఆర్అండ్‌బీకి రూ.9 కోట్లు, ఈజీఎస్ రూ.30 కోట్లు, ఎస్సీ, ఎస్టీ ఆవాసాల కింద రూ.10 కోట్ల నిధులు తెచ్చాం. ఈ ఏడాది భారీగా నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తాను.

విలువలతో కూడిన విద్యనందించాలి

● త్రిదండి దేవానాథ రామానుజ జీయర్ స్వామి


దేవునితిరుమలాపూర్‌లో మాట్లాడుతున్న జీయర్‌స్వామి

తెలకపల్లి/పెద్దకొత్తపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : విలువలతో కూడిన విద్యనందించాలని దాని కోసం తాము ప్రయత్నం చేస్తున్నామని త్రిదండి దేవానాథ రామానుజ జీయర్‌స్వామి అన్నారు. బుధవారం స్థానిక కన్యకా పరమేశ్వర ఆలయంలో జరిగిన భక్తుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న విద్య అంతా కార్పొరేట్ విద్య అని ప్రస్తుత సమాజానికి ఉపయోగపడే విద్య కాదని, విద్య అనేది విలువలతో కూడుకున్నదని విద్యార్థులకు విలువలు, సంస్కృతీ, సాంప్రదాయాలు నేర్పాల్సినవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ప్రముఖులు బల్లా శ్రీరాములు, సింగిల్ విండో వైస్ ప్రెసిడెంట్ మామిళ్లపల్లి యాదయ్య, బలుస సతీష్, నరహరి, గెలివాచారి, భక్తులు పెద్దమొత్తంలో పాల్గొన్నారు.

అందరూ భక్తి భావంతో కొలవాలి

ప్రజలందరు భక్తి భావంతో భగవంతుని కొలువాలని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో టీటీడీ సాయంతో కొత్తగా నిర్మాణం చేయనున్న కోదండ రామస్వామి ఆలయాల నిర్మాణం కార్యక్రమం భూమి పూజలో భాగంగా పెద్దకొత్తపల్లి మండలం దేవుని తిరుమలాపూర్ గ్రామంలో వెలిసిన వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆయన బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వనపర్తి నుంచి వచ్చిన మనోజ్‌శర్మ తన గానామృతంతో భక్తులను మంత్రముగ్ధుల్ని చేశారు. ఆలయ ప్రధాన ఆచార్యులు శేషాచార్యులు, ప్రణయ్‌శర్మ, కొత్తపల్లి శేఖర్, శేఖర్‌శర్మ, తెలకపల్లి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'బీసీబంధు' పై ప్రభుత్వం ఆరా !

- జిల్లాకు మంజూరైన రూ.6 కోట్ల నిధులపై విచారణకు ఆదేశం

అయిజటౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పాలనలో 2023లో బీసీబంధు పేరుతో కులవృత్తి దారులకు రుణాలు మంజూరు చేసింది. అప్పట్లో 15 రకాల కులవృత్తి దారులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ఎటువంటి షరతులు లేకుండా రుణాలు అంజేసింది. జిల్లాలోని రెండు నియోజకవర్గాలైన గద్వాలకు 300, అలంపూర్‌కు 300 యూనిట్లను మంజూరు చేసింది. అప్పట్లో లబ్ధిదారుల ఎంపిక, రుణాల మంజూరుకు కావలసిన విధి విధానాలేవి పట్టించుకోకుండా రాజకీయ పలుకుబడి కలిగిన వారి సూచనల మేరకే జిల్లా అధికారులు రుణాలు మంజూరు చేశారనే విమర్శలు వచ్చాయి.

రాజకీయ సిఫారసులకే పెద్ద పీట

బీసీ బంధు రుణాల మంజూరు విషయంలో నియోజకవర్గ స్థాయి నాయకులు ఎవరి పేరు చెబితే వారికే రుణం మంజూరైందనే ప్రచారం జరిగింది. ఏ ప్రభుత్వం అయినా ఒక పథకం ద్వారా కులవృత్తుల వారికి ఆర్థిక సాయం అందించాలనుకున్నప్పుడు ప్రథమంగా చేసే పని దరఖాస్తులు స్వీకరించటం. తరువాత వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపి వారు ఎటువంటి కులవృత్తుల్లో ఉన్నారు, ప్రస్తుతం కులవృత్తిని కొనసాగిస్తున్నారా ? లేదా ? అన్న విషయాలపై ఆరా తీయాలి. దీంట్లో కూడా ఆర్థిక పరిస్థితి బాగాలేని వారు ఎవరు అన్న విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలి. కానీ ఇవేవి పట్టించుకోకుండానే తమతమ అనుచరవర్గాలకు నాయకులు రుణాలు మంజూరు చేయించుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. రుణం మంజూరు చేయించినందుకు లబ్ధిదారుల నుంచి రూ.20 నుంచి రూ.30 వేల వరకు తీసుకున్నారనే ఆరోపణలు కూడా వినిపించాయి. ఈ విధంగా గద్వాల జిల్లాలో మొత్తం 600 యూనిట్లకు గానూ రూ. 6 కోట్ల నిధులు ఆయా లబ్ధిదారులకు అధికారులు అందజేశారు.

యూసీలు సమర్పించాలంటూ ఆదేశాలు

అప్పట్లో బీసీ బంధు పథకం ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులకు సంబంధించిన యూసీలు సమర్పించాలని జిల్లా అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. రుణం పొందిన వారి పూర్తి వివరాలు, వారు చేస్తున్న కులవృత్తి పని వివరాలు, పనితో పాటు అక్కడే దిగిన ఫొటో తదితర వివరాలతో సమగ్ర నివేదిక పంపాలని ఆదేశాలు అందాయి. ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన లక్ష రూపాయలతో వారి ఆర్థిక పరిస్థితి ఏమేరకు మెరుగు పడిందనే వివరాలన్నింటిని కూడా సమగ్రంగా ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది.

వివరాలు సేకరిస్తున్నాము



గతంలో బీసీ బంధు ద్వారా రుణాలు పొందిన వారి వివరాలను సేకరిస్తున్నాం. లబ్ధిదారులకు సంబంధించిన యూసీలు పంపాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. మా సిబ్బందితో అన్ని మండలాల్లో లబ్ధిపొందిన వారు చేసే పనుల వివరాలను సేకరిస్తున్నాము. ఇప్పటికే కొన్ని యూసీలు ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. గద్వాల జిల్లాలో మొత్తం 600 మందికి ఈ పథకం ద్వారా రుణాలు మంజూరయ్యాయి. అనర్హులకు అందిన విషయం మా నోటీసుకు రాలేదు.

- రమేష్‌బాబు, బీసీ సంక్షేమశాఖ అధికారి, గద్వాల

దిష్టిబొమ్మల్లా క్రీడా ప్రాంగణాలు

- బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం



రాజోళి మండలం, పచ్చర్ల గ్రామంలో పార్కింగ్ స్థలంగా మారిన క్రీడా ప్రాంగణం

అయిజటౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. అప్పటి ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతీ గ్రామపంచాయతీకి ఒక క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. ఆఘమేఘాల మీద వీటిని ఏర్పాటు చేసి నిర్వహణ గాలికొదిలేశారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం బోర్డులు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

గద్వాల జిల్లాలో ఇలా..

జోగుళాంబ గద్వాల జిల్లాలో 255 గ్రామపంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో వీటి ఏర్పాటుకు కావలసిన నిధులు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరు అవుతాయని చెప్పి ఆయా గ్రామపంచాయతీల సర్పంచులతో డబ్బులు ఖర్చుచేయించారు. ఒక్కో పంచాయతీలో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు రూ.60 నుంచి 80 వేల వరకు ఖర్చు చేశారు. మరి కొన్ని పంచాయతీల్లో లక్ష రూపాయలకు పైగానే ఖర్చు చేశారు. అప్పట్లో మండలస్థాయి అధికారుల ఆదేశాలతో క్రీడా ప్రాంగణాలు చదును చేయటం, మొరం వేయటం, బోర్డు ఏర్పాటుతో పాటూ, క్రీడాకారులకు కావలసిన క్రీడా సామగ్రి కొనుగోలు తదితర ఖర్చులు సర్పంచులే భరించారు. ఈ విధంగా ప్రతీ గ్రామపంచాయతీలో సూమారుగా రూ.80 వేల వరకు క్రీడా ప్రాంగణాల కోసం ఖర్చు అనుకున్నా జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.2 కోట్లపైనే ఖర్చుచేసినట్లు తెలుస్తోంది. చాలా గ్రామాలలోని క్రీడా ప్రాంగణాల్లో నిర్వహణ లేక కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగాయి.

బోర్డులు తప్ప, ఆటలు ఆడేందుకు ఏ మాత్రం అవకాశం లేని ప్రాంగణాల వల్ల ఎటువంటి ఉపయోగం లేదని క్రీడాకారులు వాపోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుచూపు లేకుండా ఆఘమేఘాలపై వీటిని ఏర్పాటు చేసి చేతులు దులుపుకుందే తప్ప క్రీడాకారులపై శ్రద్ధతో చేయలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

వినియోగంలోకి తేవాలి



గ్రామాలలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలలో సౌకర్యాలు కల్పించలేదు. అప్పట్లోనే ప్రభుత్వం ఆయా ప్రాంగణాల్లో అన్ని రకాల క్రీడా సామాగ్రి ఏర్పాటు చేసి ఉంటే క్రీడాకారులకు ఉపయోగంగా ఉండేవి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలి.

- బ్రహ్మయ్య, సింధనూరు, అయిజ మండలం

లక్షలు ఖర్చు చేశాం..



రెండేళ్ల క్రితం క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు అధి కారుల ఆదేశాల మేరకు లక్షల రూపాయలు ఖర్చు చేశాం.. కానీ బిల్లులు ఇప్పించలేదు. ఎన్ఆర్ఈజీఎస్‌లో తీసుకోమని చెప్పారు. తీరా చూస్తే సాఫ్ట్‌వేర్ మారింది మీకు బిల్లులు చెల్లించలేమని చెప్పారు. ఒక్కో సర్పంచు లక్ష రూపాయల వరకు ఖర్చు చేశాం.

- ఆత్మలింగారెడ్డి, మాజీ సర్పంచు, కలుకుంట్ల, మానవపాడు

రికార్డు చేయించుకోవాలని తెలిపాం



ప్రతీ గ్రామపంచాయతీలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు అప్పట్లో సర్పంచులు చేసిన ఖర్చులకు సంబంధించి అధికారులతో రికార్డు చేయించుకోవాలని సూచించాం. ఉపాధిహామీ పథకం నుంచి చెల్లించాలంటే సాఫ్ట్‌వేర్ సమస్య ఉంది. గ్రామాలలో క్రీడాకారులకు ఉపయోకరంగా ఉంటుందనే ఉద్దేశంతోనే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశాం.

-శ్యామ్‌సుందర్, డీపీవో, గద్వాల

ఒక్క రోజే రూ. 3.30 కోట్ల విలువైన మద్యం తాగేశారు


వనపర్తి పట్టణంలోని ఓ మద్యం దుకాణం వద్ద గుమిగూడిన మందుబాబులు

వనపర్తి క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది వనపర్తి జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా జోష్ కనిపించింది. జిల్లాలో మద్యం, మాంసం విక్రయాలు జోరుగా సాగాయి. ఈ ఏడాది డిసెంబరు 30, 31వ తేదీల్లో రెండు రోజుల్లోనే జిల్లాలో రూ.7కోట్ల 79 లక్షల 40 వేల విలువైన మద్యం తాగేశారు. గతేడాదితో పోలిస్తే కొంచెం మేర మద్యం విక్రయాలు అధికంగా జరిగినట్లు సమాచారం.

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వనపర్తి జిల్లాలో మద్యం ఏరులై పారింది. రాష్ట్ర ప్రభుత్వం ఆబ్కారీ శాఖకు మద్యం విక్రయాలు జరిపేందుకు 31వ తేదీ రాత్రి 12 గంటల వరకు అనుమతి ఇచ్చింది. సాధారణ రోజుల్లో రాత్రి 10 గంటలకే మూసివేసే దుకాణాలు మందుబాబుల సౌకర్యార్థం 12 గంటల దాకా తెరిచి ఉంచారు. దీంతో జిల్లా వ్యాప్తంగా బార్లు, వైన్స్‌ల వద్ద ఉదయం 10 గంటల నుంచే సందడి కనిపించింది. జిల్లాలో 30వ తేదీ రోజు 4,578 లిక్కర్ కేసులు, 4,101 బీర్ కేసులు, 31వ తేదీ రోజు 3,355 లిక్కర్ కేసులు, 3,546 బీర్ కేసులు విక్రయాలు జరిగాయి. ఈ రెండు రోజుల్లోనే ఆబ్కారీ శాఖకు వనపర్తి జిల్లా నుంచి రూ.7 కోట్ల 79 లక్షల ఆదాయం సమకూరింది.

పెరిగిన మాంసం విక్రయాలు

డిసెంబరు 31 అంటేనే మందు, మటన్, చికెన్‌తో దావత్ చేసుకోవడం సహజం.

ప్రతీ యేటా మద్యంతో పాటు మాంసం విక్రయాలు సహజం. రోజురోజుకు మాంసం ప్రియులు పెరుగుతుండడంతో ఈ ఏడాది మాంసం విక్రయాలు బాగా జరిగాయి. మిగతా రోజులతో పోలిస్తే 31వ తేదీన జిల్లా వ్యాప్తంగా రూ.80 లక్షల విలు వైన మాంసం విక్రయించినట్లు సమాచారం.

నిరంతరాయంగా నీటి విడుదల చేయాలి

ఆత్మకూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : వరి నాట్లు పూర్తయ్యే వరకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా నిరంతరాయం గా నీటి విడుదల చేయాలని ఆయకట్టు గ్రా మాలు మూలమల్ల, జూరాల గుంటిపల్లి, మేడ పల్లి, మోట్లంపల్లి, రేచింతల రైతులు బుధ వారం ఒక ప్రకటనలో కోరారు. వారబంది మా దిరిగా నీటి విడుదల చేస్తే మరో మూడు రోజు ల పాటు చేసిన కరిగేట్లు ఎండిపోయే అవకా శం ఉందని, దీని ద్వారా మళ్లీ చదును చేయా లంటే రైతులకు అదనపు భారం పడే అవకాశం ఉందని తెలిపారు. ప్రాజెక్టు అధికారులు గుర్తిం చి జనవరి చివరి వరకు నిరంతరాయంగా నీటి విడుదల చేయాలని రైతులు కోరారు.

జీవితాల్లో సుఖ సంతోషాలు నిండాలి


నిరంజన్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

▸▸ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, జనవరి1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరంలోఓ ప్రజలు జీవితాలలో సుఖ సంతోషాలు నిండాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం వనపర్తి పట్టణంలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించారు. కేక్‌కట్ చేసి పార్టీ నాయకులు మాజీ మంత్రి శుభాకాంక్షలు తెలి పారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు నాగన్న యాదవ్, బండారు కృష్ణ, నందిమల్ల అశోక్, మాణిక్యం, ప్రేమ్ నాథ్‌రెడ్డి, నీలస్వామి, మాధవరెడ్డి, చిట్యాల రాము తది తరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అగ్నిప్రమాదంలో మహిళ మృతి


యాదమ్మ (ఫైల్)

మిడ్జిల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మిడ్జిల్‌కు చెందిన యాదమ్మ (55) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులతో కాకుండా మరో గదిలో వేరుగా నివసిస్తోంది. మంగళవారం రాత్రి ఆమె గదిలో నిద్రపోతుండగా పక్కనే ఉన్న షార్ట్‌సర్క్యూట్ అయి విద్యుత్ తీగల నుంచి నిప్పురవ్వలు పడి మంటలు చెలరేగాయి. దీంతో ఆమె పూర్తిగా కాలిపోయి మృతి చెందింది. తెల్లవారుజామున గదిలో నుంచి ఆమె బయటకు రాకపోవడంతో కుటుంబసభ్యులు లోనికి వెళ్లి చూడగా, అప్పటికే కాలిపోయి కనిపించింది. సంఘటనపై ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అందిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఊర్కొండ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల శివారులోని కల్వకుర్తి - జడ్చర్ల ప్రధాన రహదారి పక్కనున్న బందోజీ హోటల్ సమీపంలో ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడని బుధవారం తెల్లవారు జామున పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్‌ఐ ఇబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాత్రి మొత్తం చలిలో ఉండటంతో మృతి చెంది ఉంటాడని వైద్యులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శితో ఫిర్యాదు తీసుకున్న అనంతరం పోస్టుమార్టం నిర్వహిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

బావిలో పడిన ట్రాక్టర్

» డ్రైవర్‌ను కాపాడిన రైతులు


బావిలో పడిన ట్రాక్టర్

కోడేరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : పొలంలో కరిగేట చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బావిలో పడిపోయింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండలం, నాగులపల్లి గ్రామానికి చెందిన తెలుగు శాంతయ్య తన పొలంలో ట్రాక్టర్‌తో కరిగెట చేయిస్తున్నాడు. ప్రమాదవశాత్తు అది అదుపుతప్పి పక్కనే ఉన్న బావిలో పడిపోయింది. చుట్టుపక్కల ఉన్న రైతులు గమనించి వెంటనే డ్రైవర్‌ను కాపాడి, బావిలో నుంచి బయటకు తీశారు. అనంతరం ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్‌ను బయటకు లాగారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

» నలుగురికి తీవ్ర గాయాలు


వెంకటేశ్‌ను అంబులెన్స్ వద్దకు తీసుకెళ్తున్న 108 సిబ్బంది, ప్రమాదంలో గాయపడిన గురు, అశోక్, శివ

నారాయణపేట, ఊట్కూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. నారాయణపేట జిల్లా కేంద్రం శివారులో బుధవారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు యువకులు గురు, అశోక్, శివలు పట్టణంలోని సత్యనారాయణ గుడి సమీపంలో గల బొగ్గుల బట్టిలో పని చేస్తున్నారు. వారు ముగ్గురు ద్విచక్రవాహనంపై పగిడిమారి గ్రామం నుంచి నారాయణపేట వైపు వస్తున్నారు. అదే సమయంలో పగిడిమారి గ్రామానికి చెందిన వెంకటేశ్ నారాయణపేట నుంచి పగిడిమారికి వెళ్తున్నారు. ఆ రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ పట్టణ శివారులోని మాతమాణికేశ్వరి ఆశ్రమం వద్ద ఢీకొన్నాయి. వెంకటేశ్‌కు కాలు, చెయ్యి విరిగాయి. ఒడిశా యువకులు ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అదే మార్గంలో వెళ్తున్న వాహనదారులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి బాధితులను జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దముద్దునూర్‌లో బుధవారం ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లక్ష్మమ్మ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా, బల్మూరు మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన రమేశ్ ద్విచక్ర వాహనంపై వస్తూ ఆమెను ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె కుమారుడు లింగస్వామి ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంప్రదాయ సౌందర్యం


గిరిజన మహిళలు కేశాలంకరణ కోసం వినియోగించే చుంచులు


కేశాలంకరణకు వినియోగించే జడ కుచ్చులు

» లంబాడీ మహిళల వస్త్రాలంకరణ ప్రత్యేకం » దుస్తులపై పూసలు, అద్దాలతో ప్రత్యేక డిజైన్లు
» జడకు చుంచులు, చెవులకు లోలాకులు » తలపై ముసుగు, అద్దాలతో కుట్టిన దుస్తులు
» ఉత్సవాలు, పండుగల సందర్భంగా ధరించేందుకు గిరిజన యువతుల ఆసక్తి


సంప్రదాయ దుస్తులను ధరించిన గిరిజన యువతి

అచ్చంపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : తరతరాలుగా వస్తున్న సంప్రదాయ వస్త్రధారణ, ఆభరణాలు, అలంకరణ పద్ధతులను శ్రద్ధగా కాపాడుకుంటున్నారు గిరిజనులు. ప్రధానంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని లంబాడీ మహిళల వస్త్రధారణ అత్యంత ఆకర్షణీయంగా ఉంటుంది. వారు ధరించే దుస్తులు, ఆభరణాలు ఆకట్టుకుంటాయి. ప్రస్తుతం కాలం మారింది, జీవనశైలీ మారింది. అందుకు అనుగుణంగా గిరిజన మహిళల వస్త్రధారణ కూడా మారింది. ఉన్నత విద్యాభ్యాసం, ఉద్యోగాలు చేస్తున్న యువతులు మారిన కాలానికి అనుగుణంగా ఆధునిక వస్త్రాలను ధరిస్తున్నారు. అయితే పండుగలు, ఉత్సవాల సందర్భంగా సంప్రదాయ దుస్తులు, ఆభరణాలను ధరించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అంతే కాకుండా తరతరాలుగా వారసత్వంగా వస్తున్న ప్రత్యేక నృత్యాన్ని నేర్చుకుంటున్నారు. యువకులు కూడా తలపాగా, కుర్తా, పంచెలు ధరిస్తున్నారు.

183 గిరిజన గ్రామ పంచాయతీలు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 183 గిరిజన గ్రామ పంచాయతీలు, 892 ఆవాసాలు ఉన్నాయి. మొత్తంగా గిరిజనుల జనాభా 1,81,173 మంది ఉండగా, వారిలో 1,37,797 మంది మహిళలు ఉన్నారు. వారిలో పెద్ద వయసు వారు ఇప్పటికీ సంప్రదాయ దుస్తులనే ధరిస్తున్నారు. అయితే ఆ దుస్తులను ధరించడం, ప్రత్యేక ఆభరణాలతో అలంకరించుకోవడానికే చాలా సమయం పడుతుంది. దీంతో చాలా మంది విద్యాభ్యాసం, ఉద్యోగాలు చేస్తున్న యువతులు అంత సమయం కేటాయించలేకపోతున్నారు. అంతే కాకుండా ఉరుకులు, పరుగుల జీవితాల్లో ఆ దుస్తులను ధరించడం సౌకర్యంగా ఉండకపోవడం కూడా వారు ఒక కారణంగా చెప్తున్నారు. ఈ పరిస్థితుల్లో తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు లంబాడీ మహిళలు కృషి చేస్తున్నారు. తండాలు, సమీప పట్టణాల్లో నిర్వహించే తీజ్ ఉత్సవాలు, సేవాలాల్ జయంతి, ముత్యాలమ్మ పండుగ తదితర గిరిజన ఉత్సవాల్లో యువతులు తమ సంప్రదాయ దుస్తులు ధరించేలా, ఆభరణాలతో అలంకరించుకునేలా ప్రోత్సహిస్తున్నారు.


తీజ్ ఉత్సవం సందర్భంగా సంప్రదాయ అలకరణలో గిరిజన యువతులు (ఫైల్)

అలంకరణకే రెండు గంటలు

సంప్రదాయ వస్త్రధారణ, కేశాలంకరణకు దాదాపు రెండు గంటలకు పైగానే పడుతుందని లంబాడీ మహిళలు చెప్తున్నారు. ముందుగా తల వెంట్రుకలను దువ్వి జడ వేస్తారు. ఆ తర్వాత ముందు వైపు ముఖానికి రెండు వైపులా చిన్న జడలను అల్లి 'చుంచుల'తో అలంకరిస్తారు. వాటిని చోట్లు అంటారు. అలాగే జడను ప్రత్యేకంగా రూపొందించిన ఆభరణాలతో అలంకరిస్తున్నారు. ఆ తర్వాత చేతుల నిండా గాజులు, కడియాలు, పట్టీలను ధరిస్తారు. అద్దాలు, పూసలు, గవ్వలతో అందంగా కుట్టిన మేలి ముసుగు, లుంగ, రవికను ధరిస్తారు. ఇలా ఎవరికి వారు అలంకరించుకోవడం సాధ్యం కాదని, మరో మహిళ సహకారం తప్పనిసరి అని వారు చెప్తున్నారు.

జత దుస్తులు, ఆభరణాలకు రూ. 40 వేలు

గిరిజన సంప్రదాయ దుస్తుల తయారీకి దాదాపు మూడు నెలల సమయం పడుతుంది. జత దుస్తులు, ఆభరణాలకు దాదాపు రూ.40 వేలు ఖర్చు అవుతుందని చెప్తున్నారు. దుస్తుల తయారీకి అవసరమైన పూసలు, అద్దాలు, పాత నాణేలను జాతరలు, సంతల్లో కొనుగోలు చేస్తారు. ప్రధానంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట సంతలో గిరిజన వ్యాపారులు వీటిని విక్రయిస్తుంటారు. అలాగే ప్రతీ సంవత్సరం జనవరిలో సంక్రాంతి పండుగ తరువాత, రంగాపూర్ గ్రామంలో నిర్వహించే హజ్రత్ నిరంజన్ షేక్ షా వలీ జాతర సందర్భంగా వీటి క్రయవిక్రయాలు జోరుగా సాగుతాయి.

సంప్రదాయాలను కాపాడుకోవాలి

శంకర్, గిరిజన నాయకుడు : సంస్కృతి, సంప్ర దాయాలను కాపాడుకుంటూ, వారసత్వంగా భావి తరాలకు అందించాలి. అందుకోసం గిరిజనులను ఒక్క చోటకు చేర్చేందుకు ప్రతీ సంవత్సరం తీజ్ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నాం. ఉత్సవాలు, పండుగల సమయంలో మహిళలు, పురుషులు సంప్రదాయ దుస్తులను ధరించేలా ప్రోత్సహిస్తున్నాం. అయితే సాధారణ రోజుల్లో తండాల్లో పెద్ద వయసు మహిళలు మాత్రమే సంప్రదాయ దుస్తులను ధరిస్తున్నారు. యువతులు అంతగా ఆసక్తి చూపడం లేదు.


జడ అల్లి చుంచులు పెడుతున్న మహిళ, దుస్తులపై అద్దాలు, పూసలు కుడుతున్న మహిళలు

ఇలా ఉంటేనే బాగుంటుంది



లక్ష్మి, గిరిజన మహిళ : నాకు చిన్నప్పటి నుంచి మా సంప్రదాయ పద్ధతిలో దుస్తులు వేసుకోవడమే అలవాటు. బుద్ధి తెలిసినప్పటి నుంచి మా పద్ధతిలోనే దుస్తులను ధరిస్తున్నాను. నాకు అసలు చీర కట్టుకోవడం రాదు. అయినా మా సంప్రదాయ దుస్తులను ధరించడమే నాకు ఇష్టం. అవే నాకు బాగుంటాయి. ఇప్పుడిప్పుడే తమ పిల్లలకు కూడా మా సంప్రదాయ దుస్తు లను కుట్టిస్తున్నారు.

ప్రయోగశాలలకు నిధులు మంజూరు

» ఫిబ్రవరి మూడు నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు » మార్చి ఐదు నుంచి వార్షిక పరీక్షలు
» నారాయణపేట జిల్లాలో ఎనిమిది ప్రభుత్వ జూనియర్ కళాశాలలు

నారాయణపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లాలోని ఎనిమిది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని ప్రయోగశాలల్లో వసతుల కల్పన, సైన్స్ పరికరాలు, రసాయనాల కొనుగోలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో కళా శాలకు రూ. 25 వేల చొప్పున విడుదల చేసింది. ఐదేళ్ల క్రితం 2018-2019 విద్యా సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ప్రయోగశాలలకు నిధులు మంజూరు చేసింది. ఆ తర్వాత నిధులు లేక ప్రయోగశాలల పరిస్థితి దయనీయంగా మారింది. తాజాగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో విద్యార్థులకు ఊరటనిచ్చింది. ఇలాగే ప్రతీ సంవత్సరం నిధులను విడుదల చేస్తే మేలు చేకూరుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అంతకు ముందే ప్రయోగశాలల్లో కెమెస్ట్రీ, ఫిజిక్స్, బాటనీ, జువాలజీ సబ్జెక్టులకు అవసరమైన పరికరాలు, రసాయనాలకు సంబంధించి సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రతిపాదనలను రూపొందించి ఉన్నతాధికారులకు పంపించడంతో ప్రభుత్వం నిధులను విడుదల చేసింది.


ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

కళాశాలల ఖాతాల్లో నిధులు

మంజూరైన నిధులను జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎనిమిది ప్రభుత్వ కళాశాలల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని ఇన్‌చార్జి డీఐఈవో సుదర్శన్‌రావు తెలిపారు. ప్రతిపాదనల మేరకు కళాశాల కమిటీల ద్వారా వెచ్చించి, అవసరమైన పరికరాలు, సామగ్రిని కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిబ్రవరి మూడవ తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. నారాయణపేట జిల్లాలో 750 మంది ఇంటర్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. అలాగే మార్చి ఐదవ తేదీ నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

'పీఎం కిసాన్ సమ్మాన్' పెంపుతో

74,283 మందికి లబ్ధి

» నారాయణపేట జిల్లా రైతులకు రూ.74.28 కోట్లు


ట్రాక్టర్‌తో కరిగెట చేస్తున్న రైతులు

నారాయణపేట,జనవరి 1(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకం ద్వారా రైతులకు అందించే పెట్టుబడి సాయాన్ని కేంద్రం ఆరు వేల రూపాయల నుంచి రూ.10 వేలకు పెంచడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2019 నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఏడాదికి మూడు విడతలుగా ఆరు వేల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు రైతులు తమ బ్యాంకు ఖాతాలకు కేవైసీ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంపై వ్యవసాయ శాఖ నారాయణపేట జిల్లా జిల్లా అధికారి జాన్‌సుధాకర్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈవోలు చర్యలు తీసుకున్నారు. నారాయణపేట జిల్లాలోని 13 మండలాల్లో 4,25,203 ఎకరాల సాగు భూమి ఉంది. 99,837 మంది రైతులు ఉన్నారు. వారిలో అర్హులైన 74,283 మంది రైతుల ఖాతాల్లో ఏడాదికి రూ.44.57 కోట్ల చొప్పున జమ చేసింది. తాజాగా ఈ మొత్తాన్ని రూ. 10 వేలకు పెంచడంతో జిల్లా రైతుల ఖాతాల్లో కేంద్రం ప్రభుత్వం ఈ ఏడాది రూ. 74.28 కోట్లు జమ చెయ్యనున్నది. ఈ లెక్కన జిల్లా రైతులకు రూ. 29.71 కోట్ల మేర అదనపు లబ్ధి కలుగనున్నది.

రైతులకు ఎంతో మేలు



కేంద్ర ప్రభుత్వ ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద పెట్టుబడి సాయాన్ని రూ. 10 వేలకు పెంచడం వల్ల రైతాంగానికి ఎంతో మేలు చేకూరనున్నది. సాయాన్ని పెంచుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.

- వెంకోబా, కిసాన్ సంఘ్ జోనల్ కార్యదర్శి, నారాయణపేట.

హోరాహోరీగా నెట్‌బాల్ టోర్నీ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ స్టేడియంలో సీఎం కప్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. పోటీల్లో క్రీడాకారులు నువ్వా, నేనా అన్నట్లుగా తలబడుతున్నారు. బుధవారం నిర్వహించిన పోటీల్లో పురుషుల మహబూబ్‌నగర్ జట్టు హన్మకొండపై 21-04, రంగారెడ్డిపై 15-05 పాయింట్ల తేడాతో గెలిచింది. ఖమ్మం జట్టు పెద్దపల్లిపై 35-01, కామారెడ్డి జట్టు మెదక్‌పై 17-14, నిజామాబాద్ జట్టు ఆసిఫాబాద్‌పై 21-10, వరంగల్ జట్టు నిర్మల్‌పై 13-5, రాజన్న సిరిసిల్ల జట్టు మేడ్చల్‌పై 05-04 పాయింట్లతో గెలుపొందాయి. నల్గొండ జట్టు వనపర్తిపై 15-09, కరీంనగర్ జట్టు గద్వాలపై 23-12, ఆదిలాబాద్ జట్టు పెద్దపల్లిపై 13-02, మెడ్చల్ జట్టు మెదక్‌పై 29-09 పాయింట్లతో గెలుపొందాయి. నిజామాబాద్ జట్టు జనగాంపై 18-13, నాగర్‌కర్నూల్ జట్టు నిర్మల్‌పై 32-01, నారాయణపేట జట్టు భద్రాద్రి కొత్తగూడెంపై 12-03, మహబూబాబాద్ జట్టు సంగారెడ్డిపై 28-04 పాయింట్ల తేడాతో గెలుపొందాయి. మహిళల విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు మంచిర్యాలపై 19-03, ఖమ్మం జట్టు నాగర్‌కర్నూల్‌పై 25-01, ఆసిఫాబాద్ జట్టు నిర్మల్‌పై 15-01 పాయింట్ల తేడాతో గెలిచాయి. నల్గొండ జట్టు వరంగల్‌పై 24-02, కరీంనగర్ జట్టు వనపర్తిపై 08-03, జనగాం జట్టు మంచిర్యాలపై 21-03, నిజామాబాద్ జట్టు నారాయణపేటపై 14-03, మెదక్ జట్టు మహబూబాబాద్‌పై 15-08 పాయింట్ల తేడాతో గెలిచాయి. నల్గొండ జట్టు రాజన్న సిరిసిల్లపై 26-01, వనపర్తి జట్టు హన్మకొండపై 07-04, జనగాం జట్టు జగిత్యాలపై 17-03, నిజామాబాద్ జట్టు నాగర్‌కర్నూల్‌పై 13-01పై, ఖమ్మం జట్టు నారాయణపేటపై 30-04 పాయింట్ల తేడాతో గెలుపొందాయి.


మహబూబ్‌నగర్, హన్మకొండ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్కంఠభరిత సందర్భం


ఆడేందుకు అవకాశం ఇవ్వాలని ఆందోళన చేస్తున్న రంగారెడ్డి జిల్లా క్రీడాకారులు

జాతీయ స్థాయి పోటీలకు ఎదగాలి

నెట్‌బాల్ జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబే దుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలను రెండవ రోజు బుధవారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్, నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విక్రమాదిత్యరెడ్డి, ఖాజాఖాన్, కబడ్డీ సంఘం సెక్రటరీ కురుమూర్తిగౌడ్, యోగా సంఘం సెక్రటరీ బాలరాజ్, డీఎస్‌ఏ కార్యాలయ సిబ్బంది రవీందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

టోర్నీలో గందరగోళం

సీఎం కప్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ టోర్నీలో బుధవారం కొంత గందరగోళం నెలకొన్నది. టోర్నీకి ప్రతీ జిల్లా నుంచి ఒక మహిళ, ఒక పురుషుల జట్టు మాత్రమే హాజరుకావాల్సి ఉండగా, రంగారెడ్డి జిల్లా నుంచి రెండు పురుషుల, రెండు మహిళల జట్లు వచ్చాయి. వాటిలో ఒక పురుష, ఒక మహిళా జట్టుకు రంగారెడ్డి జిల్లా డీవైఎస్‌వో సంత కంతో కూడిన ఎంట్రీ ఫాంలు ఉన్నాయి. మరో రెండు జట్లకు ఎంట్రీఫాం లేకపోవడంతో అనుమతించలేదు. దీంతో క్రీడాకారులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో మా జట్లు గెలుపొంది, రంగారెడ్డి జిల్లా డీవైఎస్‌వో చేతుల మీదుగా పతకాలు, సర్టిఫికెట్ల ను తీసుకున్నట్లు తెలిపారు. అయినా తమకు ఆడేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. క్రీడాకారులు గంట సేపు చేపట్టిన ఆందోళనతో మ్యాచ్‌లకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా డీవై ఎస్‌వో శ్రీనివాస్ ఇరు జట్ల కోచ్‌లు, క్రీడాకారులతో మాట్లాడారు. ఆడేందుకు అవకాశం ఇస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఈ విషయంపై డీవైఎస్‌వో శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, రంగారెడ్డి జిల్లా నుంచి అదనంగా రెండు జట్లు వచ్చాయని తెలిపారు. రంగారెడ్డి డీవైఎస్‌వో, శాట్ ఉన్నతాధికారులతో చర్చించి, ఇరు జట్ల క్రీడాకారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు.

ఇంటర్వ్యూ..

తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి

» డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బి.నిరంజన్



తెలకపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను చెల్లించాలని డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బి.నిరంజన్ అన్నారు. రుణాలు ఇవ్వడానికి ఆరు బ్యాంకులతో యాక్షన్ ప్లాన్ చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు తెలియజేశారు.

● **మండలంలో ఎన్ని స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి?**

మండలంలో స్వయం సహాయక సంఘాలు 748 ఉండగా అందులో 8259మంది సభ్యులు ఉన్నారు. 2024-25 సంవత్సరానికి గాను 631సంఘాలకు రూ. 22కోట్ల 29లక్షల 34 వేల టార్గెట్ ఇవ్వడం జరిగింది.

● **ఇప్పటి వరకు ఎంతమందికి రుణాలు ఇప్పించారు?**

215మందికి రూ. 2కోట్ల 13లక్షల 76వేల రుణాలు ఇప్పించడం జరిగింది.

● **రుణాలు తీసుకున్న వారికి ఏమైనా బీమా సౌకర్యం ఉందా?**

రుణాలు తీసుకున్న సభ్యులకు బీమా సౌకర్యం ఉంది. మార్చి 14, 2024 నుంచి మార్చి 13, 2025వరకు బీమా సౌకర్యం ఉంటుంది.

న్యూస్ బాక్స్

'దిశ' కమిటీ సభ్యులుగా ఇద్దరికి స్థానం



ఎం.భగవంత్‌రెడ్డి



చెన్నయ్య

నాగర్‌కర్నూల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి, నిధుల వినియోగంపై నియమించిన కమిటీలో ఎంపీ మల్లురవి జిల్లా కేంద్రంలో ఇద్దరికి స్థానం కల్పించారు. దిశ కమిటీలో విద్యావేత్తలు ఇద్దరికి ప్రాతినిధ్యం కల్పించారు. మాచిరెడ్డి భగవంత్‌రెడ్డి, వార్డెన్ చెన్నయ్యలకు దిశ కమిటీలో స్థానం దక్కింది. నిధుల సక్రమ సద్వినియోగం చట్టాల అమలుపై తమపై గురుతరమైన బాధ్యతను అప్పగించిన ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలకు వార్డెన్ చెన్నయ్య, భగవంత్‌రెడ్డిలు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో సీఎంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరించాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఉప్పునుంతల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన పోలమోని బొందయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందిన విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీంద్రారావు బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల నగదుతో పాటు 50 కేజీల బియ్యం అందచేశారు. జావిద్, చిల్కేశ్వరం శ్రీను, అనిల్, సాయికృష్ణగౌడ్, మధుయాదయ్, శ్రీధర్‌రావు, గెలువయ్య, సైల్యాబ్, సాయిబాబా, నరేందర్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన గిరిజన సంఘం నాయకులు



మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పెద్దకొత్తపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని తన నివాస గృహంలో బుధవారం గిరిజన నాయకులు కలిశారు. నియోజకవర్గానికి చెందిన గిరిజన సంఘం నాయకుల బృందం వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.రవినాయక్, లచ్చునాయక్ తండా గ్రామ మాజీ సర్పంచు శంకర్‌నాయక్‌తో పాటు పలువురు గిరిజన నాయకులు ఉన్నారు.

ఆలయాలు కిటకిట

నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రజలు ఆనందోత్సవాలతో సంబురాలు జరుపుకున్నారు. ఇంటిముంగిళ్లలో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగవల్లులు పరిచారు. ఉదయం నుంచే పల్లె, పట్టణం అనే తేడా లేకుండా పెద్ద ఎత్తున ఆలయాలను దర్శించుకుని.. ఈ ఏడాది అన్నీ శుభాలే జరగాలని ప్రత్యేక పూజలు చేశారు.

» భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు
» ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు
» ఇంటి ముంగిళ్లలో నూతన సంవత్సరానికి స్వాగతం పలికే రంగవల్లులు

అచ్చంపేట/చారకొండ/కల్వకుర్తి/ఉప్పునుంతల/బిజినేపల్లి/ఊర్కొండ/తాడూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉమామహేశ్వర క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. వెకువజామునుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉమామహేశ్వరుడ్ని దర్శించుకున్నారు. ఏడాది పొడవునా తమకు అన్ని శుభాలే జరగాలని కాంక్షిస్తూ పూజలు చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకొని పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను కొండదిగువన నుంచి కొండపైకి నడిపింది. ఉమామహేశ్వరంలో రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాస్ రావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సిర్సనగండ్లలో..

చారకొండ మండలంలో రెండవ అపర భద్రాద్రిగా పేరుగాంచిన సిర్సనగండ్లలోని అయోధ్యనగర్ (గుట్ట)లో వెలసిన సీతా రామచంద్రస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి అర్చనలు అభిషేకాలు చేశారు.

కల్వకుర్తిలో...

కల్వకుర్తి పట్టణంలోని పలు దేవాలయాలను స్థానికులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని కల్వకుర్తి నియోజ కవర్గంలోని పలువురు నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఉప్పునుంతల మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామిని బుధవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి ఆయన ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదం తీసుకున్నారు. ప్రజలకు, నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నాయకులు అనంతరెడ్డి, నర్సింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మొగులాల్, నర్సింహారావు, తిరుపతయ్య, రాత్లావత్ కృష్ణ, తదితరులు ఉన్నారు.

వట్టెం వెంకన్న ఆలయంలో

బిజినేపల్లి మండల కేంద్రంతో పాటు పా



ఉమామహేశ్వరం ఆలయంలో భక్తులతో పూజలు చేయిస్తున్న అర్చకులు

లెం, వట్టెం, నంది వడ్డెమాన్‌లోని ఆలయాలో తెలవారు జాము నుంచే చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయాలు నిండిపోయాయి. కొత్త సంవత్సరం మొదటి రోజు దైవ దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేస్తే అంత మంచే జరుగుతుందన్న విశ్వాసంతో భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టేందుకు ఆలయాల బాట పట్టారు. ఆలయాలకు తరలి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వట్టెం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సందడి ప్రతాప్ రెడ్డి, పాలెం వెంకన్న ఆలయం ఈవో రంగారావులు తెలిపారు.

అభయుడి ఆలయంలో భక్తుల సందడి

ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం భక్తుల సందడి నెలకొంది. బుధవారం నూతన సంవత్సరం పురస్కరించుకొని పరిసర గ్రామాలతో పాటు సదూర ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలిరావడంతో ఆలయం పరిసరాలు కిక్కిరిసినవి. తెల్లవారుజామున అర్చకులు స్వామివారికి అభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి దర్శనం కల్పించారు. భక్తులు తమ మొక్కులను చెల్లించుకొని సాముహిక వ్రతాలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది మారుతిరావు, వరలక్ష్మి, శ్రీశైలం. రవికుమార్, అర్చకులు దత్తాత్రేయశర్మ, మహేశ్వర్మ, ప్రవీణ్ శర్మ, శ్రీనివాసశర్మ భక్తులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నరసింహస్వామి సరస్వతీల హోమం

తాడూరు మండలంలోని సిర్సవాడ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో నరసింహ సరస్వతి దేవి జయంతిని పురస్కరించుకుని హోమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ఊయలలో వేసి ఊపి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న భక్తులందరికీ అన్నప్రసాదాలను అందజేశారు. ఆలయ అర్చకులు జగదీశ్వర్, రమేష్, రాఘవేందర్, వెంకటయ్య, రాములు, రవి కుమార్, పరుశరాములు, గోపాల్‌గౌడ్, తిరుపతయ్య, మల్లేష్ పాల్గొన్నారు.



సిర్సవాడ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నరసింహసరస్వతీ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎంబీ చర్చిలో...

కందనూలు(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎంబీ చర్చిలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ముఖ్య ప్రసంగికులుగా కర్నూల్ ప్రాంతం నుంచి డాక్టర్ రెవరెండ్ మోజస్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఆ దేవాది దేవుని వ్యాక్యాన్ని అనుసరించినప్పుడే అందరం నూతన జీవితాన్ని పొంది ఆశీర్వదింపబడుతామని అన్నారు. అనంతరం చర్చి కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక సంఘ పాస్టర్ వీఎస్.భాస్కర్, చర్చి కమిటీ సభ్యులు, చైర్మన్, యూత్ కమిటీవారు, మహిళలు, సంఘ పెద్దలు, సంఘస్తులు, సుమారు 300మంది హాజరయ్యారు.



సిరసనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మామిళ్లపల్లిలో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఎస్‌టీయూ టీఎస్ డైరీ, జీవో పుస్తకం ఆవిష్కరించిన మంత్రి

కొల్లాపూర్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ పట్టణంలో ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ఎస్‌టీయూ టీఎస్ 2025 డైరీ, జీవో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మొట్టమొదటి ఉపాధ్యాయ సంఘం ఎస్‌టీయూ టీఎస్ డైరీ ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను యోగా, మెడిటేషన్, క్రమశిక్షణను అందించాలని సూచించారు.

పదవ తరగతిలో జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు సంఘం మురళి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు హనుమంత రెడ్డి, రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ ఈశ్వర్, రాష్ట్ర కార్యదర్శి రమేష్, లక్ష్మారావు, జిల్లా కార్యదర్శి పోకల శేఖర్, నాగర్‌కర్నూల్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, బాల్‌రెడ్డి, బాలస్వామి, కొల్లాపూర్ మండల అధ్యక్షులు వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి చంద్రుడు, కోశాధికారి జాకీర్ హుస్సేన్, జిల్లా నాయకులు షఫీ, చెన్నయ్య, శివశంకర్, పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షులు నందకిషోర్ యాదవ్, కోడేర్ మండల బాధ్యులు ఎల్లయ్య , శేఖర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



2025 ఎస్‌టీయూ డైరీ, జీవో పుస్తకం ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆపద్భాందవా.. అయ్యప్పా

» ఆనందగిరి కొండపై మార్మోగిన అయ్యప్ప నామస్మరణ
» ఘనంగా మహాపడి పూజోత్సవం

బిజినేపల్లి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : హరిహర సుతుడా అయ్యప్ప.. ఆపద్భాందవా అయ్యప్పా అంటూ భక్తులు భక్తి పారవశ్యంతో మహాపడి పూజోత్సవం అయ్యప్ప మాలధారణ స్వాములు వైభవంగా చేపట్టారు. మండల కేంద్రంలోని ఆనందగిరి కొండపై వెలసిన శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం అయ్యప్ప మాలధారణ స్వాములు పులేందర్ రెడ్డి, తుమ్మల సురేందర్, శ్రీను, కుమ్మరి శ్రీను, లగిశెట్టి చంటి, గుబ్బ రవి, తుమ్మల వెంకటయ్య, కుమ్మరి రాజు మహాపడి పూజోత్సవాన్ని గురుస్వామి రఘునాథ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేలాదిగా హాజరైన భక్తుల అయ్యప్ప స్వామి నామస్మరణతో ఆనందగిరి కొండ మారుమోగింది. స్వామి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు కనుల పండువగా చేశారు.

ఈ సందర్భంగా స్వామి వారికి భక్తుల చేసిన కనకాభిషేకాన్ని భక్తుడు చీర్ల బాలస్వామి రూ.1.60 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించిన పలువురు దాతలను పూలదండలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం 18 కలశాలతో ప్రత్యేక పూజలు చేసేందుకు భక్తులు వేలంలో కళశాలను దక్కించుకొని స్వామికి అభిషేకాలు చేశారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్నదాన వితరణ నాయినోళ్ల బాలరాజు, సుధా పరిమళ్ల దంపతులు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నందకిశోర్ రెడ్డి, సింగర్ ప్రకాశ్, డాక్టర్ శ్రీకాంత్, మధుసూదన్ రెడ్డి, మహేష్ నాయక్, తిరుపతయ్య, శేఖర్, అనంతరెడ్డి, ప్రవీణ్, కంపిండ్ల శ్రీను, నరసింహులయ్య పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామికి పుష్పాభిషేకం చేస్తున్న అయ్యప్ప మాలధారులు

ట్యాంక్‌బండ్ వద్ద సందర్శకుల తాకిడి

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం మినీ ట్యాంక్‌బండ్ వద్ద సందర్శకుల రద్దీ కనిపించింది. నాగర్‌కర్నూల్ పట్టణ ప్రజలకు ఏకైక ఆహ్లాద కేంద్రం కావడంతో చిన్నారులతో కలిసి ట్యాంక్‌బండ్ చేరుకుని సరదాగా గడిపారు. కేసరిసముద్రం బుద్ధ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన బోటులో పట్టణ ప్రజలు కుటుంబ సమేతంగా షికారు చేసి ప్రకృతిని ఆస్వాదించారు. రోజువారి కంటే రద్దీ ఎక్కువగా కనిపించింది. బతుకమ్మ ఘాట్ వద్ద పార్కులో చిన్నారులు ఆటలాడుతూ సంతోషంగా గడిపారు. నూతన సంవత్సరం సందర్భంగా సందర్శకుల రాకను దృష్టిలో ఉంచుకుని ట్యాంక్‌బండ్ వద్ద ప్రత్యేక తినుబండారాలు, ఐస్‌క్రీం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలోని పలు దేవాలయాల వద్ద భక్తుల దర్శనాలతో రద్దీ కనిపించింది.



జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఆటలాడుతున్న చిన్నారులు

ఘనంగా భీమా కోరేగావ్ విజయ్ దివస్



నాగర్‌కర్నూల్‌లో భీమా కోరేగావ్ విజయ్ స్తూపం చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న అంబేడ్కర్ ఐడియాలజీ మిషన్ సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఐడియాలజీ మిషన్ ఆధ్వర్యంలో బుధవారం 'భీమా కోరేగావ్ విజయ్ దివస్' ను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన భీమా కోరేగావ్ విజయ్ స్తూపం చిత్ర పటానికి మిషన్ అధ్యక్షుడు టి.మద్దిలేటి పూల మాల వేసి మహార్ అమరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూణె సమీపంలోని భీమానది ఒడ్డున ఉన్న కోరేగావ్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకునేందుకు బ్రిటీష్ ప్రభుత్వం పంపిన 28 వేల మంది పీష్వాలపై కేవలం 500 మంది మహార్‌లు యుద్ధం చేసి 1818 జనవరి 1న విజయం సాధించారని పేర్కొన్నారు. వీరోచిత పోరాటంలో అమరులైన మహార్ యుద్ధ వీరుల చిహ్నంగా భీమా కోరేగావ్ స్తూపం నిర్మించారన్నారు. భీమా కోరేగావ్ స్తూపాన్ని అంబేడ్కర్ ప్రతీ ఏటా జనవరి 1న సందర్శించి అమరులకు నివాళులు అర్పించేవారన్నారు. అంబేడ్కర్ ఐడియాలజీ మిషన్ సభ్యులు శోభన్‌బాబు, కృష్ణయ్య, చంద్రయ్య, గోవర్ధన్, వెంకటస్వామి, చెన్నయ్య, రాము, నరసింహ, శివకుమార్, జయన్న, సుధాకర్, వెంకటయ్య, చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలకు చెరువు నుంచి నీటి విడుదల

చారకొండ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుర్కలపల్లి సమీపంలో ఉన్న చారకొండ పెద్ద చెరువునుంచి పిల్ల కాలువలకు బుధవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకటగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్‌లు నీటిని విడుదల చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చారకొండ పెద్ద చెరువు కింద మండల కేంద్రానికి చెందిన వారి భూములకు ఆరుతడి పంటల కోసం చెరువునుంచి పిల్ల కాలువలకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్‌గౌడ్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోరేటి శివ, మైనార్టీ మండల అధ్యక్షుడు సత్తార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు గ్యార లక్ష్మణ్, నర్సింహారెడ్డి, నాయకులు కేశమోని శంకర్‌గౌడ్, ఏముల రవిందర్‌గౌడ్, యాదయ్యగౌడ్, వెంకటయ్యగౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చెరువునుంచి నీటిని విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలి

తిమ్మాజిపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరంలో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆ దిశగా ప్రభుత్వం కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్ అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సూచనల మేరకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదేశాలను అనుసరిస్తూ తిమ్మాజిపేట మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 226మంది విద్యార్థులకు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దుప్పట్లను పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రాందేవ్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ హుస్సేన్, బీఆర్‌ఎస్ నాయకులు జయపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, హుస్సేనయ్య, ప్రత్యేక అధికారిని సుజాత పాల్గొన్నారు.



కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులు

తాడూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం పాఠశాలల్లో కళాశాలల్లో యూనివర్సిటీల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరూ రాబోయే తరాలకు భావిభారత పౌరులుగా ఎదిగి భారతదేశ ఔన్నత్యాన్ని పెంపొందించేలా ముందుకెళ్లాలని రిటైర్డు డీఈవో విజయ్‌కుమార్ అన్నారు. మహాత్మాగాంధీ ఆశయాలను స్వామి వివేకానందుని ఔన్నత్యాన్ని పుణికిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. బుధవారం ఆయన చేపట్టిన సత్యశోధన పాదయాత్ర తాడూరు మండల కేంద్రానికి చేరుకుని ఎంపీడీవో బ్రహ్మచారి, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో కస్తూర్బా బాలికల వసతి గృహం నందు విద్యార్థులతో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.

అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పారిశుధ్య సిబ్బందిని అభినందించారు.



కస్తూర్బాలో విద్యార్థులతో విశ్రాంత ఉమ్మడి జిల్లా విద్యాధికారి విజయ్‌కుమార్

మెదక్ ఎంపీని కలిసిన బీజేపీ నాయకులు

- కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని విన్నపం

అచ్చంపేటటౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 293 సర్వే నెంబరులో గల నాలుగు ఎకరాల 32 గుంటలు గతంలో ప్రభుత్వ భూమిగా రికార్డులో ఉండగా, ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులపైకి మారడాన్ని మెదక్ ఎంపీ రఘునందన్‌రావును బుధవారం కలిసి వివరించారు. బీజేపీ అచ్చంపేట నాయకులు మంగ్యానాయక్, బాలాజీ, గంగిశెట్టి నాగరాజు, బల్మూరి జానికి, రవీందర్‌తో పాటు పలువురు నాయకులు ఆయనను కలిసి వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట్లు విలువ చేసే భూములు అప్పనంగా అన్యాక్రాంతమవుతుంటే అధికారులు, ప్రభుత్వం, ఎమ్మెల్యే చోద్యం చూస్తున్నారన్నారు. ఈ విషయంపై ఎంపీ రఘునందన్‌రావు అచ్చంపేట ఆర్డీవోను ఫోన్‌ద్వారా విషయం అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడటంలో పూర్తిగా సహకరించాలని కోరారన్నారు. ఇంతటి విలువైన భూమిని పేదల కోసం ఉపయోగించాలని, లేని పక్షంలో అక్కడే ఉద్యమిస్తామని ఆమరణ దీక్ష చేసేందుకు సిద్ధమవుతామని జిల్లా మహిళా నాయకురాలు బల్మూరి జానకి తెలిపారు.



మెదక్ ఎంపీని కలిసిన అచ్చంపేట బీజేపీ నాయకులు

వాసవీ క్లబ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ నూతన క్యాలెండర్ 2025ను ఆవిష్కరించారు. బుధవారం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ ప్రెసిడెంట్ హకీం రాజేష్, మిడిదొడ్డి రాధాకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు.

వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు అర్థం లలిత సాయికృష్ణ, ప్రధాన కార్యదర్శి గుంత లక్ష్మీ శేఖర్, కోశాధికారి నాగచంద్రిక, దయానంద్, కోదండ రాములు, సభ్యులు కొట్ర బాలాజీ, వాస రాఘవేందర్, పాలాది సాయిబాబా, ఆకుతోట మధు మోహన్, బొడ్డు రమణ, గంధం గీత ప్రసాద్, శంకర్, కందూరు లక్ష్మణ స్వామి, సాయిశంకర్, చిదంబరం, వాసవి క్లబ్ ఉపాధ్యక్షుడు కంచర్ల శ్యాంసుందర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు